క్లుప్తంగా

20న మండల సర్వసభ్య సమావేశం

మహబూబాబాద్ రూరల్ : మండల సర్వసభ్య సమావేశం ఈనెల 20న బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

ఆర్థికసాయం



గూడూరు : మండల కేంద్రంలోని మట్టివాడ నవీన్‌కుమార్ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక సేవికా సమితి ప్రతినిధులు గురువారం ఆ కుటుంబానికి ఖర్చుల నిమిత్తం కొంత నగదుతో పాటు బియ్యం అందించారు. అందజేసిన వారిలో సేవికా సమితి ప్రతినిధులు స్వరూప, పావని, శ్రీలక్ష్మి, ప్రసూన, సరస్వతి, పుష్ప, శ్రీలత, సునిత, రాజ్యలక్ష్మి ఉన్నారు.

పరామర్శ



మరిపెడ రూరల్: మండలంలోని స్టేజితండ గ్రామ పరిధిలోని కుడియాతండాకు చెందిన జాటోతు బావసింగ్ (75) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మృత దేహాన్ని సందర్శించి పూల మాల వేసి నివాళులర్పించాడు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని వ్యక్తం చేశాడు. ఆయన వెంట ఓడీజీఎంఎస్ మాజీ చైర్మన్ కుడితి మహేందర్‌రెడ్డి, గంధసిరి కృష్ణ, సర్పంచ్ జాటోతు భీమా నాయక్, రెడ్డి ఉన్నారు.

గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్ ఏర్పాటు



కేసముద్రం: మండలంలోని కల్వల జెడ్పీ హైస్కూల్‌లో గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్‌ను గురువారం ఏర్పాటు చేశారు. క్లబ్ చైర్మన్‌గా పాఠశాల హెచ్‌ఎం బండారు నరేందర్, కన్వీనర్‌గా రోజారాణి, ప్రతి తరగతి నుంచి ఇద్దరు విద్యార్థినులు, పోలీస్‌స్టేషన్ నుంచి ఒక మహిళా కానిస్టేబుల్ సభ్యులుగా ఉన్నట్లు హెచ్‌ఎం తెలిపారు. హెచ్‌ఎం నరేందర్ మాట్లాడుతూ బాలికలు వివిధ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికలకు ఎలాంటి వేధింపులు తలెత్తిన క్లబ్ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ అరుణ, టీచర్లు జ్యోతి, రత్నమాల పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన ఉండాలి



కేసముద్రం: హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ శాంతరాజ్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి సహకారంతో సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గులు, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అజీజ్‌బేగ్, ఏఎస్సై రాజయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుంత పూడ్చివేత



గార్ల: మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీలో ఇల్లందు–మహబూబాబాద్ బీటీ రహదారి మధ్యలో ప్రమాదభరితంగా ఉన్న గుంతను గురువారం పంచాయతీ కార్యదర్శి కిషన్ సిబ్బందిచే పూడ్చించారు. గత 6 నెలలుగా బీటీ రహదారిపై ఏర్పడ్డ గుంతను పూడ్చడంలో సంబంధిత ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. కార్యదర్శి మానవత్వంతో గుంతను పూడ్చించారు.

ఆడపిల్లల హక్కులను రక్షించాలి

● మరిపెడ ఐసీడీఎస్ సీడీపీఓ శిరీష



ఎల్లంపేట హైస్కూల్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీడీపీఓ శిరీష

మరిపెడ రూరల్ : ఆడ పిల్లల హక్కులను రక్షించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఐసీడీఎస్ సీడీపీఓ శిరీష అన్నారు. మండలంలోని ఎల్లంపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో 'బేటి బచావో బేటి పడావో'పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. పిల్లలకు మంచి పోషకాహారం అందించి భవిష్యత్‌లో గొప్పగా ఎదిగేలా ప్రోత్సహించాలన్నారు. ఆడపిల్లల అక్రమ రవాణ, ఏదైనా ఆపద వచ్చినప్పుడు హెల్ప్‌లైన్ నంబర్ 1098, 181, 100, 1930 ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం బాల్యవివాహాలు, బాలల అక్రమ రవాణా, లైంగిక వేధింపులపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నాగరాజు, ఏసీడీపీఓ రాజ్యలక్ష్మి, శ్రీలత, కల్యాణి, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపోటములు సహజమే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

గూడూరు : ఆట, పాటలతో పాటు ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమేనని, పదవి ఉన్నా లేకున్నా పార్టీ కోసం పని చేస్తున్న కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ అన్నారు. స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముందుగా కార్యకర్తల అభిప్రాయాలను తెల్సుకున్నారు. గ్రామాల వారీగా పార్టీ పరిస్థితి ఎలా ఉందని చర్చించారు. ప్రజలు మార్పు కోరుకున్నారని, కేసీఆర్ చేసిన అభివృద్ధి పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారని గ్రామస్థాయి నాయకులు తెలిపారు. అనంతరం శంకర్‌నాయక్ మాట్లాడుతూ కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తాను నిలబడుతానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్నాయా అనే విషయాలపై నిఘా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, జెడ్పీ కోఆప్షన్ ఎండీ. ఖాసీం, నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ కిషన్, సంపత్‌రావు, సురేందర్, మంగీలాల్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



దంతాలపల్లి : స్థానిక మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ విజయలక్ష్మి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న భోజనం మెనూ ప్రకారం శుభ్రంగా అందివ్వాలన్నారు. విద్యార్థులను అడిగి భోజనం గురించి తెలుసుకున్నారు. వంట చేసేవారికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

అంగన్‌వాడీ సెంటర్ మార్పు : మండల ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రత్యేకంగా ఉన్న అండన్‌వాడీ సెకండ్ సెంటర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలోనే ఓ గది లోకి మార్పించినట్లు తెలిపారు. ఆమె వెంట పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు వీరస్వామి, ఎంపీఓ అప్సర్ పాషా, ఉపాధ్యాయులు ఉన్నారు.

పనులు వేగవంతం చేయాలి



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్

మహబూబాబాద్: మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటి పరిదిధిలోని పత్తిపాక రోడ్డులో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జగన్, డీఈ సీహెచ్ ఉపేందర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యానికి బోనస్ చెల్లించాలి

బయ్యారం : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ మేరకు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి బోనస్ డబ్బులు చెల్లించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు నందగిరి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. మండలంలోని వెంకట్రాంపురంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరిగిన పెట్టుబడులు, ప్రకృతి వైపరీత్యాలతో ప్రస్తుతం ఉన్న వరి మద్దతు ధర రైతులకు లాభసాటిగా లేక నష్టపోతున్నారన్నారు.సమావేశంలో వెంకన్న, మురళి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

మంత్రులు, స్పీకర్‌కు శుభాకాంక్షలు





గార్ల : మంత్రిని పొంగులేటిని కలిసిన జెడ్పీటీసీ, స్పీకర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న శ్రీరాంయాదవ్



మరిపెడ రూరల్: మంత్రి ప్రభాకర్‌ను కలిసిన పీఆర్‌టీయూ మండల కార్యదర్శి మహేష్‌గౌడ్

మరిపెడ రూరల్: తెలంగాణ రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్ మహేష్ గౌడ్ గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని సూచించారు. మంత్రి స్పందిస్తూ ఉపాధ్యాయుల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయనున్నట్లు చెప్పినట్లు తెలిపారు.

మంత్రి పొంగులేటిని కలిసిన జెడ్పీటీసీ

గార్ల: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రిగా సచివాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టిన పొంగులేటి శ్రీనివాసరెడ్డిని గురువారం స్థానిక జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుండా వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, సంజీవరెడ్డి, ఎస్‌కె బుడాన్, జాటోత్ రమేష్, తదితరులు ఉన్నారు.

స్పీకర్‌ను కలిసిన టీపీసీసీ సభ్యుడు

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌ను గార్లకు చెందిన టీపీసీసీ సభ్యుడు ఎడ్ల శ్రీరాంయాదవ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్‌కు ఆయన అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలం



మహబూబాబాద్ అర్బన్ : మానుకోట నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ భూక్య మురళీనాయక్ గెలుపునకు కృషి చేసిన నాయకులు. ప్రజలు పార్టీకి కార్యకర్తలే బలమని కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్, 1వ వార్డు కౌన్సిలర్ వెన్న లక్ష్మారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే పేదలకు, అణగారిన వర్గల వారికి న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భూక్య శ్రీను, మాలోత్‌రెడ్డి, లక్ష్మణ్, నాగరాజు, వినేయ్, గణేష్, కిషన్, రాజు, బాలాజీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి రవి

నెహ్రూసెంటర్ : ఈనెల 16న మహబూబాబాద్‌లో జరిగే ఐక్యప్రజాపంథా ఉమ్మడి జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు. పార్టీ సమావేశం జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత విప్లవోద్యమ శ్రేణులను ఐక్యం చేసే కృషిలో భాగంగానే మూడు విప్లవ పార్టీల ఐక్యమవుతున్న నేపథ్యంలో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు.సమావేశంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు పైండ్ల యాకయ్య, సత్యం, శంకరయ్య, భద్రు, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమరంలోనూ సత్తా చాటాలి

కొడకండ్ల: అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేసి సత్తా చాటాలని కొడకండ్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ కోరారు. గురువారం లక్ష్మక్కపల్లి, పెద్ద బాయితండాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి గెలుపునకు ఎనలేని కృషి చేసి మండలంలో మెజార్టీ లభించేలా కృషి చేసారని, అభ్యర్థి విజయానికి పనిచేసిన వారందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి షేక్ అబ్దుల్లా పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడికి పంపాలి



ఎల్బీతండాలో సర్వే చేపడుతున్న సీఆర్పీ రంగయ్య

పెద్దవంగర: బడీడు పిల్లలను బడికి పంపాలని సీఆర్పీలు రంగయ్య, రమాదేవి అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో బడి బయట పిల్లలను గుర్తించేందుకు మండలంలోని సీఆర్పీలు సర్వే చేపట్టారు. సోమ్లా, భంగ్యా, ఎల్బీ తండాల్లో వారు సర్వే నిర్వహించారు. బడిబయట పిల్లలు ఎవరూ లేరని తెలిపారు. గత ఐదు రోజులు పాఠశాలలకు వెళ్లని పిల్లలను తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలకు పంపినట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సోమయ్య, ఉపాధ్యాయురాలు మహబూబీ, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరిస్తా..

దేవరుప్పుల : ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తూ ప్రభుత్వ పరమైన అభివృద్ధి పనుల పురోగతికి తన వంతు సహకరిస్తానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ మండల స్థాయి సమావేశంలో సార్వత్రిక ఎన్నికలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ తెచ్చిన కేసీఆర్ హయాంలో రైతు సంక్షేమం కోసం చేసిన అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం రాద్ధాంతం చేసే తీరు తగదన్నారు. తన హయాంలో పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.450 కోట్ల పనులు మంజూరు చేశానన్నారు. ఇకపై వారంకో మండలాన్ని పర్యటించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు సుందర్‌రామిరెడ్డి, మల్లేశం, సావిత్రి పాల్గొన్నారు.

మడగూడెం పాఠశాల తనిఖీ



గంగారం : మహబూబాబాద్ డీఈఓ ఎర్రయ్య ఆదేశానుసారం కురవి ప్రభుత్వ పాఠశాల గెస్ట్ హెచ్‌ఎం డీజేఎస్ శర్మ ప్యానల్ టీం ఆధ్వర్యంలో మడగూడెం పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. మౌళిక సదుపాయాలు, విద్యార్థుల నైపుణ్యాలు, మధ్యాహ్న భోజనం అమలు తదితర అంశాలపై పాఠశాలలో ఆరా తీశారు. అనంతరం పలు రకాల రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల విషయ పరిజ్ఞానంపై పట్టు సాధించే విధంగా తీసుకునే చర్యలపై ఆరాతీశారు. వారి వెంట అనురాధ, మోహన్, రమణ, హరినాద్, హెచ్‌ఎం రాములు ఉన్నారు.

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి



గార్ల : సమ్మెనుద్దేశించి మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర నాయకుడు బండి జయరాజ్



గూడూరు : సమ్మె చేస్తున్న ఉద్యోగులు



నర్సింహులపేటలో...

గార్ల: గ్రామీణ తపాలా తాత్కాలిక ఉద్యోగుల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని గ్రామీణ డాక్ సేవక్ సంఘం రాష్ట్ర నాయకులు బండి జయరాజ్, వై.పట్టాభిరామయ్యలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పోస్టాఫీస్ ఎదుట ఉద్యోగులు చేస్తున్న సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. తక్కువ వేతనంతో విధులు నిర్వహిస్తూ తమ కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె విరమించేది లేదన్నారు. సమ్మె శిబిరాన్ని సీపీఎం, సీపీఐ, న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు కందునూరి శ్రీనివాసరావు, జంపాల వెంకన్న, జి సక్రులు సందర్శించి సమ్మెకు సంఘీభావం తెలిపారు. సమ్మెలో తపాలా శాఖ తాత్కాలిక ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

గూడూరు: జీడీఎస్ ఉద్యోగులను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని ఉమ్మడి వరంగల్ డివిజన్ మాజీ అధ్యక్షుడు బొబ్బ శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక పోస్టాఫీస్ ఎదుట గ్రామీణ తపాలా ఉద్యోగులు గురువారం 3వ రోజు నిరవధిక సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ఉప్పలయ్య, సూరయ్య, అశ్విని, కిరణ్‌కుమార్, కార్తీక్, మహేశ్ వెంకటరమణ, వెంకన్న పాల్గొన్నారు.

సబ్ పోస్టాఫీస్ ఎదుట ధర్నా

నర్సింహులపేట : మండల కేంద్రంలోని తపాలా సబ్ పోస్టాఫీస్ ఎదుట గురువారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు(జీడీఎస్) ధర్నా చేశారు. కార్యక్రమంలో జి.వెంకన్న, రమేష్, కుమారస్వామి, కె.వెంకన్న, సోమయ్య, సాయి, నాగరాజు, ఉప్పలయ్య పాల్గొన్నారు.

నిజాం చెరువుపై కేబుల్ బ్రిడ్జి నిర్మించాలి



నెక్లెస్ రోడ్డు తొలగింపు పనులను పరిశీలిస్తున్న అజయ్‌సారథిరెడ్డి

నెహ్రూసెంటర్ : ప్రజారవాణా, పర్యాటకం కొరకు ప్రత్యామ్నాయంగా నిజాం చెరువుపై కేబుల్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని నిజాం చెరువువద్ద నెక్లెస్‌రోడ్, బతుకమ్మ ఘాట్ తొలగింపును సీపీఐ బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి కొందరు ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్వాకం వల్ల నిజాం చెరువు అక్రమాలు, చెరువు పరిరక్షణపై మత్స్యపారిశ్రామిక సహకార సంఘం హైకోర్టును ఆశ్రయించగా కోర్టు ఇచ్చిన తీర్పుతో నెక్లెస్ రోడ్, బతుకమ్మ ఘాట్‌లను తొలగింపు జరుగుతుందని ఆరోపించారు. హైదరాబాద్ దుర్గం చెరువు మాదిరిగా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే విధంగా కేబుల్‌బ్రిడ్జిని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పర్యాటక అభివృద్ధి విషయమై కలెక్టర్, ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవిస్తామని అజయ్‌సారథిరెడ్డి తెలిపారు.కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, వెలుగు శ్రావణ్, వికాస్ పాల్గొన్నారు.

శ్రీవేట వేంకటేశ్వరస్వామి విడిది ప్రారంభం



అమ్మపాలెంలో ప్రారంభమైన కల్యాణ విడిది

డోర్నకల్ : మండలంలోని అమ్మపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవేట వేంకటేశ్వరస్వామి విడిది కల్యాణ మంటపం గురువారం ప్రారంభమైంది. గార్ల మండలం మర్రిగూడెం వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ వేడుకలు, ఊరేగింపులు, తెప్పోత్సవాలు మూడేళ్లకోసారి గ్రామంలో నిర్వహిస్తారు. గ్రామానికి చెందిన దాత వెంకటయ్య ద్వారా స్థలం సేకరించి గ్రామస్తులతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు సుమారు రూ.23 లక్షలను సమకూర్చి కల్యాణమండపాన్ని నిర్మించారు. కార్యక్రమంలో మల్లం వెంకటనారాయణ, కమల, నరేందర్, పద్మ, సర్పంచ్ ధరంసోత్ రాంబాయిశంకర్, ఎంపీటీసీ పద్మ, కృష్ణమూర్తి, కోటయ్య, రవి, భాష్‌సింగ్, యు.శ్రీనివాస్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సక్రు

గార్ల : మిచౌంగ్ తుపాన్‌తో దెబ్బతిన్న పంటలను సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే సర్వే చేపట్టి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సక్రు మాట్లాడారు. మండలంలోని 20 పంచాయతీల్లో రైతుల పంటలు చేతికొచ్చే దశలో తుపాన్ వలన పంటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా అనంతరం తహసీల్దార్ స్వాతిబిందుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు ఎస్ మనోహర్, ఎం వీరభద్రం, సీహెచ్ గణేష్, ఎం.మాన్యా, మంగయ్య, రఘు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



భిక్షంరెడ్డిని సన్మానిస్తున్న పాస్టర్లు

డోర్నకల్: మండలంలోని గొల్లచర్ల స్టేజీ శివారు సాయి గార్డెన్స్‌లో గురువారం తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా పాస్టర్స్ అండ్ ఇవాంజెలిస్ట్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మినీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో టీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ డాక్టర్ సుదర్శన్, రెవ.కరుణాకర్ తదితరులు క్రిస్మస్ సందేశాన్ని బోధించారు. వీరితో పాటు డోర్నకల్ పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షంరెడ్డిని ఘనంగా సన్మానించారు. టీసీసీ జిల్లా అధ్యక్షుడు పాస్టర్ జెల్లా అబ్రహం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నిరీక్షణరావు, డానియల్, ఆనందరావు, జేమ్స్, జాన్‌పాల్, త్యాగరాజు, తిమోతి, సామ్యేల్, అపరంజి. ప్రభుదాస్, సురేష్, ప్రభాకర్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.